తెల్లబంగారం మెరిసేనా..!


వర్షానికి పాడైన పత్తి పంట

- వారం రోజుల్లో చేతికి రానున్న పంట
- వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- ఆదుకోవాలంటున్న రైతులు

కోస్గి రూరల్: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట మరో వారం, పది రోజుల్లో చేతికి రానుంది. రెండు మూడేళ్లుగా తక్కువ దిగుబడి రావడం, తెగుళ్లతో పత్తికి సరైన మద్దతు ధర లభించలేదు. ఈ సారైనా మద్దతు ధర వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కోస్గి డివిజన్ పరిధిలో కొత్తపల్లి మండలంలో 620, గుండుమాల్ మండలంలో 950, మద్దూర్ మండలంలో 3200, కోస్గి మండలంలో 2300 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే ఈ సారి అధిక వర్షాలు పడి పంట దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర పెంచి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు..

గతంలో కంటే ఈ సారి పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి సాగు చేసేందుకు దాదాపు రూ.40వేల పైనే ఖర్చు అయినట్లు తెలుపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడడంతో పొలాల్లో నీరు నిలిచి మొక్కలకు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసేందుకు మరిన్ని అదనపు ఖర్చులు అయినట్లు రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా ప్రస్తుతం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందంటున్నారు.

మద్దతు ధరపై ఆశలు..

రెండేళ్లుగా పత్తి ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట పత్తి క్వింటాలుకు రూ.10వేలు ధర పలికింది. ఆ తర్వాత రూ.8వేల వరకు పలికింది. ధర పెరుగుతుందని ఆశతో చాలా మంది పత్తిని నిల్వ చేసుకుని నష్టపోయారు. ఈ సారి పెరిగిన పెట్టుబడులకు రూ.10వేల మద్దతు ధర ఉంటే తప్ప తమకు న్యాయం జరగదని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్దతు ధర కల్పించాలి



నాకున్న మూడెకరాల్లో నాలుగేళ్లుగా పత్తి పండిస్తున్నాను. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి తప్ప మద్దతు ధర మాత్రం లభించడం లేదు. ఈ సారి వర్షాలు పడడంతో పంట దెబ్బతింది. ఉన్న కాస్త పంటకు ధర పెంచితేనే పత్తి రైతులకు మేలు జరుగుతుంది. – వెంకటయ్య, రైతు, కోస్గి

వర్షాలతో దిగుబడి తగ్గింది



మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి పండిస్తున్నాను. ఈ సంవత్సరం పంట కాయదశలో ఉండగా భారీ వర్షాలు పడటంతో పంటకు ఎర్ర తెగులు వచ్చింది. దీంతో దిగుబడి సగానికి సగం తగ్గిపోయింది. ప్రభుత్వమే స్పందించి మద్దతు ధర పెంచితే నష్టపోకుండా ఉంటాం.

–వన్నెకారి రాజు, రైతు, కోస్గి

క్లుప్తంగా

జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం



మక్తల్: పారేవుల హెడ్‌వర్క్ ఇంటెక్ వెల్ సత్య సాయి పరిధిలో విధులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెండింగ్ జీతంతో పాటు 30 నెలల పీఎఫ్ దీపావళిలోగా ఇవ్వకుంటే ఈనెల 20 నుంచి విధులు బహిష్కరిస్తామన్నారు. పారేవుల నుంచి తాగునీటిని ఇంటెక్ వెల్ పంపింగ్‌ను నిలిపి వేస్తామన్నారు. కార్యక్రమంలో బసంత్‌రెడ్డి, కుర్వరాజు, సత్యనారాయన, గోవిందురెడ్డి, గోవర్దన్, బ్రహ్మానందం, పరుశురాములు, ఆంజనేయులు, నాగరాజు రఘువీర్ మనివర్దన్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



మాగనూర్: నాగర్ కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ కూతురు నందినిని మాగనూర్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ సంఘం జిల్లా డైరెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని నీట్ యూజీ పరీక్షలలో 455 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీట్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించండి



నారాయణపేట రూరల్: నారాయణపేట నుంచి మొగల్ మడ్కా గ్రామానికి వెళ్లే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు మంగళవారం ఆర్టీసీ సీఐ అలివేలమ్మకు వినతిపత్రం అందజేశారు. దామరగిద్ద మండలం మొగల్ మడ్కా గ్రామానికి వెళ్లే బస్సును నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పాఠశాలల సమయానికి తగ్గట్లు బస్సు నడపాలని కోరారు. బస్సు ఉన్నా లేటుగా వస్తుండడంతో విద్యార్థులు పాఠశాలలకు వచ్చే వరకు ఉదయం రెండు క్లాసులు కోల్పోతున్నారని వివరించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాత సమయానికే బస్సును నడపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ నరేష్, టౌన్ కార్యదర్శి సతీష్, చరణ్, భరత్, క్రాంతి పాల్గొన్నారు.

కారు ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

మరికల్: మండలకేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మరికల్ నుంచి ఎలిగండ్ల శివారులో ఉన్న ఇటుక బట్టి దగ్గరకు ఓ వ్యక్తి కారులో వస్తున్నాడు. అదే సమయంలో తిర్మలయ్య పస్పుల దగ్గర ఉన్న పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకొని రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొని తర్వాత స్కూటీని కూడా ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో తిర్మలయ్య కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దామరగిద్ద: మండలంలోని విటలపూర్ గ్రామ శివారుల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దౌలతాబాద్ మండలం సుల్తాన్‌పూర్ తండాకు చెందిన శంకర్ నాయక్ ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో పోలీసులు మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో దాడి చేసి రూ.8200 నగదు, 5 బైకులు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఇంఛార్జి ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న నాయకులు

మరికల్: ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అధికార మదంతో మాట్లాడుతున్నారని జిల్లా బీసీ సంఘం, ముదిరాజ్ సంఘాల నాయకులు నారాయణ, కొండప్ప, నర్సింములు విమర్శించారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌పై అనిరుద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో అభివృద్ధి చేసిన ఎర్రశేఖర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అధికార బలంతో మాట్లాడటం సరికాదని, అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నారు. ఎర్రశేఖర్ కాంగ్రెస్‌లో చేరితే తప్పేముందని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శేఖర్, రమేష్, రాజు, జగదీశ్, కృష్ణయ్య,వెంకటేష్, సతీష్, సత్యన్న, రామస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


విత్తనాలు అందిస్తున్న ఏఓ, నాయకులు

నర్వ: ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అఖిలారెడ్డి అన్నారు. మంగళవారం నర్వ రైతు వేదికలో రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబుల్ ఫైల్ సీడ్స్ వెరైటీ (ఎఒఎ32) అనే రకం విత్తనాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు సకాలంలో విత్తనాలను విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్వేత,ఆఫ్రీన్, కథలప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, రాయికోడ్ మల్లేష్, శేఖర్‌రెడ్డి, ఉమాపతి, విష్ణువర్ధన్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం


పోషణ్ అభియాన్ కార్యక్రమంలో అంగన్‌వాడీలు


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

దామరగిద్ద: గర్భస్థ శిశువు మొదలు చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఇన్‌చార్జి సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని క్యాతన్‌పల్లి సెక్టార్ ఆధ్వర్యంలో దేశాయ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపట్టిన పోషణమాసం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. చిన్నారులు శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. అంతకు ముందు పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూప, రత్నమాల, హెల్త్ సూపర్‌వైజర్ జానకమ్మ, అంగన్‌వాడి టీచర్‌లు, ఆశావర్కర్లు, గర్భిణులు కిషోరబాలికలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం స్టాళ్ల ప్రదర్శన

కోసి రూరల్: బాల్యం బలహీనం కాకుండా పౌష్టికాహారంతో అవసరమని గుండుమాల్ పీహెచ్‌సీ వైద్యురాలు కిష్టమ్మ, ఎంపీడీఓ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి సమిష్టి పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్‌లను పరిశీలించారు.

భూనీడులో పోషణ్ అభియాన్

కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామంలో అంగన్‌వాడీల సమక్షంలో పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, తల్లులకు పోషకాహారం ప్రాధాన్యత వివరించారు. ముఖ్యంగా గర్భిణులు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలకు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మొలకెత్తిన ధాన్యాలు, రాగులు, మొక్కజొన్నలు, నువ్వులు, పల్లీలు, బెల్లం, కొబ్బెర లాంటివి తినడం వల్ల కావలసిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి ప్రచారం

నారాయణపేట: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం రహ్మత్ నగర్‌లో బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల బాకీ కార్డులను పంచుతూ వినూత్న రీతిలో ప్రచారానికి తెరలేపారు. ఆయనతో పాటు నారాయణపేట నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం

దామరగిద్ద/మద్దూరు: కుష్ఠు వ్యాధి నివారణకు వైద్య సిబ్బందితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ సంపత్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించి ఎండీటీ మాత్రల ద్వారా పూర్తిగా నివారించవచ్చన్నారు.

నేటి నుంచి టీకాల పంపిణీ

మద్దూరు: పశువులకు గాలికుంటూ వ్యాధి సోకకుండా బుధవారం నుంచి టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారిణులు విశాల, సబిత తెలిపారు. బుధవారం రెనివట్ల, పెదిరిపాడ్, నందిపాడ్, పల్లెర్ల, చింతల్‌దిన్నే గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా వేసే ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఎంఈఓ కరీముల్లా, జీహెచ్‌ఎం నాగరత్నమ్మ ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఎంఈఓ, జీహెచ్‌ఎం పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. జిల్లా స్థాయి క్రీడాల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం పార్టీల నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, బసంత్, రాజేష్, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



దామరగిద్ద: మండలంలోని విటలపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శిరీష అండర్ –17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల జీఎచ్‌ఎం నాగిరెడ్డి సమక్షంలో ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మద్దూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచి ఉమ్మడి పాలమూర్ జిల్లాకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని కరాటే వ్యవస్థాపకులు షిహాన్ సలాంబిన్ అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని లయన్స్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ పోటీలో వంశీతేజ, కేధార్‌నాథ్ సత్తా చాటి ఉమ్మడి జిల్లాకు ఎంపిక అవడం ఆనందంగా ఉందన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మరికల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సూర్య చంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సూర్యచంద్ర ఫౌండేషన్ తరఫున మొదటి బహుమతిగా రూ.3016, రెండో బహుమతి రూ.2016 అందజేశారు. ఎంఈఓ కరీముల్లా, జీహెచ్‌ఎం నాగరత్నమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

ధన్వాడ: మండలంలోని గోటూర్ గ్రామంలో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తూ పంచాయతీని శుభ్రంగా ఉంచుతున్న సిబ్బంది రోగాల బారిన పడకుండా ముందస్తుగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు.

రైజింగ్ విజన్-2047 సర్వేలో పాల్గొనండి

నారాయణపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంటును రూపొందిస్తోందని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న విజన్- 2047 డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఉండేలా సిటిజన్ సర్వే చేపట్టారన్నారు. అక్టోబర్ 10న ప్రారంభమైన ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్న సర్వేలో ప్రజలు, ఎన్.ఆర్.ఐలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పాల్గొని సలహాలు, సూచనలు అందించాలన్నారు. అలాగే సర్వేకు సంబంధించిన లింక్‌ను, క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వ సిబ్బంది తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. http//www.telangana.gov.in/telanganarising/ లింక్ ద్వారా సర్వేలో పాల్గొనాలని సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


అడిషనల్ కలెక్టర్ శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

నారాయణపేట: జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎస్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా పత్తి సాగు చేయడం జరిగిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలతో పూత, పిందె రాలి దిగుబడి సగానికి పడిపోయిందన్నారు. చేతికి వచ్చిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్లో అత్యధికంగా రూ.7500 నుంచి అత్యల్పంగా రూ.4,500 వరకు ధర పలుకుతున్నా రైతుకు సరాసరి రూ.5500 నుంచి రూ. 6000 వరకు మాత్రమే ధర వస్తుందన్నారు. రైతుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకపోయే పరిస్థితి ఉందన్నారు. రైతుకు ఊరట ఇవ్వాలంటే ప్రభుత్వం తక్షణమే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తేమ శాతం 20 ఉన్న రూ. 8110కు కొనుగోలు చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశ వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభానికి గురవుతుందన్నారు. దేశవ్యాప్తంగా 60 లక్షల కుటుంబాలకు పైగా సాగు చేస్తున్న పంటలకు సరైన ప్రోత్సాహకాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రధాని మోదీ అమెరికా ఒత్తిడికి గురై పత్తిపై ఉన్న 11 శాతం సుంకాన్ని రద్దు చేయడం దేశ పత్తి రైతులకు గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. అన్నదాత అప్పుల పాలు కాకుండా ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, కొండ నరసింహులు, సహాయ కార్యదర్శి నారాయణ, ఉషప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు


పత్తిని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి

ఊట్కూరు: పత్తి రైతులను ఆదుకునేందుకు సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేపడుతామని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి తెలిపారు. ఊట్కూరు శివారులోని పత్తి మిల్లును మంగళవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాలతో పత్తి దిగుబడి తగ్గిపోయిందని, వచ్చిన కాస్త పత్తికి ధర తక్కువగా ఉందని పలువురు రైతులు చైర్మన్ ముందు గోడు వినిపించారు. క్వింటాలుకు రూ.5–7 వేలలోపే ధర పలుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కేంద్రం ద్వారా ప్రభుత్వం పత్తి కొనుగోలును చేపడుతుందని రైతులు తొందరపడి పత్తిని తక్కువ ధరకు అమ్ముద్దని సూచించారు. ఆయన వెంట నాయకులు రమేష్, హనుమంతు ఉన్నారు.

పోలీసుల విధులపై అవగాహన


పోలీస్ విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామ్‌లాల్

మాగనూర్: మండలంలో నేరడగంలోని శ్రీ సిద్ధలింగేశ్వర విద్యాలయం విద్యార్థులు మంగళవారం మక్తల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్‌శాఖ దినచర్య, విధులు, పనితీరు, పోలీస్‌స్టేషన్‌లో జరిగే వివిధ కార్యకలాపాలను మక్తల్ సీఐ రామ్‌లాల్ విద్యార్థులకు వివరించారు. వైర్‌లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఎఫ్‌ఆర్‌ఐ రిజిస్ట్రేషన్ విధానం, పహారా డ్యూటీలు, సీసీ కెమెరాల పనితీరు, డయల్ 100 సేవలు, మహిళల భద్రత చర్యలు తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించే విధానం, ఘటన స్థలానికి చేరుకోవడం, సహాయక చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రేవతి, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

జిల్లాను ఎంపిక చేయడం అభినందనీయం


ధన్వాడలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ఉట్కూరులో మోదీ, డీకే అరుణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధన్వాడ: 'ధనధాన్య కృషి యోజన' పథకాన్ని ప్రారంభించి అందులో నారాయణపేట జిల్లాను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జెండా కట్ట వద్ద మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ కృషి యోజన కింద దేశంలో వంద జిల్లాలను ఎంపకి చేశారని ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపికచేయడంతో ఒక్కో జిల్లా అభివృద్ధికి ఏడాదికి రూ.240 కోట్లు విడుదల కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమేష్‌కుమార్, కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్దన్‌గౌడ్, నాయకులు రాంచంద్రయ్య, ఉదయభాను, మల్లయ్య, మాకం సురేందర్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఊట్కూరు: ప్రధాని మోదీ ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు మండల బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకంలో భాగంగా తెలంగాణ నుంచి 4 జిల్లాలను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. కేంద్రం రైతు సమస్యలను పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హనుమంతు, నాయకులు కృష్ణయ్య గౌడ్, రమేష్, కొండన్ గోపాల్, రణవీర్ శంకర్‌గౌడ్, శాంత్‌గౌడ్, కుర్వ ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రఘు ప్రేమ తీర్థుల జయంతి ఉత్సవాలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో రఘురేమతీర్థుల జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిర్మాణ్యం సుప్రభాతం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ మహానైవేద్యం, రథోత్సవం, భజన పల్లకి సేవ, సర్వసేవ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్వాన్ అనిల్ దేశాయి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ రఘుప్రేమ తీర్థుల మహిమలను కొని ఆడారు. ఈ ప్రాంత భక్తుల మనోవిష్టం నెరవేర్చేందుకు లక్ష్మీ నరసింహ శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాంత ప్రజల సుకృతం అన్నారు. ఆలయ అర్చకులు నరసింహ చారి రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు రాఘవేందర్‌రావు, నరసింహ, మంజునాథ జోషి, సీతారామారావు, జె తీర్థ అనంతరావు శ్రీహరి ప్రహల్లాద అనంతరావు మంజునాథ జోషి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్మించిన, నిర్మాణ దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలను, అదే విధంగా రెవెన్యూ రికార్డులో ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఎలాంటి అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.